

# టేకిట్ ఈజీ!! - 3

## శ్రీనివాస ఫణికుమార్ డొక్కా





## –7–

## ఫాలో మీ...

"సార్, మీరు ఈ ఉగాదికి మాంచి ఆధ్యాత్మిక ప్రసంగం ఒక నైన్ డేస్ చెయ్యాలి, నవమి దాకా" అన్నారు ఆయన ఫోన్ చేసి.

"అదేంటి సార్, నాకేం తెలుసని చెప్పమంటారు?" అన్నాను అనుమానంగా.

"భలే వారే. ప్రతీ అడ్డమైన గాడిద కొడుకూ చెబుతున్నాడీ మధ్యన, మీకేంటి సార్." అన్నాడాయన భరోసాగా.

నన్ను అడ్డమైన వాళ్ళలో లెఖ్ఖేసాడో, "గా.కొ" లలో లెఖ్ఖేసాడో, చెప్పేవాళ్ళలో లెఖ్ఖేసాడో అడగాలనిపించలేదు. నోట్లో చేదుగా అనిపించింది. జీవితేచ్ఛ నశించింది. ఓ పేలవమైన నవ్వు నవ్వి ఊరుకున్నాను. ఆయన పట్టు వదల్లేదు. నేను ఒప్పుకోక తప్పలేదు. అలా మొదలైంది నా జైత్రయాత్ర.

*నా మొదటి ప్రసంగం :*

"హలో్...హలో..ఆ మైక్ ఓకే. అమ్మా, మీరు కాస్త ఎడంచేతివేపు కూర్చోండమ్మా. మీ వెనకాలాయన కనబట్టం లేదు. ఆ యేవండీ, మీరు ఇలా కుడి వైపుకి ఒచ్చేయండి. మధ్యలో నేను పారిపోవడానికి, ఐ మీన్ గాలి పోసుకోడానికి కాస్త దారి వదిలేయండి. టైము ఏడయింది. ఇంకో ఇద్దరు రాంగానే మొదలెడదాం ప్రవచనం." అన్నాను.

కిసుక్కుమని నవ్వాడు ఎదురుగ్గా కూర్చున్న శాల్తీ.

"నవ్వుతారేం?" అన్నాను బిక్క మొహం వేసి.

"ఇంకెవల్లూ రారు, నువ్వు కానీ" అన్నాడు నిర్లక్ష్యంగా మెడ గోక్కుంటూ.

ఆరోజు నేను ప్రిపేర్ అయి వచ్చిన భగవద్గీత ఇంట్రడక్షన్ చెప్పాను. "దుర్యోధనుడికి బోల్డు సైన్యం వుంది. ధర్మరాజుకి కుంచెం వుంది. ఐనా చివరికి ధర్మమే గెలుస్తుందన్నమాట" అన్నాను కాస్త కాన్ ఫిడెంట్ గా.

"అదేటీ, పాండవులు గదా గెలవాలి. ఈ ధర్మం ఎవరు మజ్జిలోని?" అంది లెఫ్ట్ సైడు శాల్తీ.

"అంటే, ధర్మ రాజు నిక్ నేం "ధర్మం" అన్నమాట. అదీ సంగతి. ఇంక వినండి, " అని కంటిన్యూ చేసా.

మధ్యలో ఆ ఆంబోతు గాడు కాసేపు కాళ్ళు జాపి, తరవాత ఒకటి మడిచి, ఒకటికి వెళ్ళొచ్చి, కాస్త వెనక్కి స్థంభానికి జార్లాపడి, బోర్లాపడి, వెల్లకిల పడి, లేచి, కార్పెట్లోంచి బొచ్చు పీకుతూ అది ముక్కులో తిత్తి పెట్టుకుని తుమ్ముతూ, మహా యాతన పెట్టేసాడు. ఇంతలో ధర్మకర్త గారు బాల్చీలో కట్టుపొంగలి, చేతిలో అరిటాకు ముక్కల్తో వచ్చేసి, వాళ్ళిదరికీ పంచేసారు.

వాళ్ళు తిని సంతృప్తిగా దీవించి, " అధిరిపోయింది మీ ప్రసంగం. ప్రసాదం కూడా అదుర్స్, సీ యు టుమారో.." అనేసి ఆకుల్లో ఇంటికి ఆట్టే పట్టికెళ్ళారు ప్రసాదాలు.

నాకు మెల్లిగా పద్ధతి అర్థవైంది. ఆ మర్నాడు కలి పొంగలి ప్రభావం వల్ల ఆరుగురు వచ్చారు. వారికి ముందుగానే పొంగలి, పచ్చడి, సాంబారు, మిళ్ళు గిన్నెల్లో పాయసం చుక్కలూ ఏర్పాటు చేసాము. వాళ్ళవి తిని, త్రేంచి, మొహమాటం లేకుండా ఎక్కడపడితే అక్కడ కూర్చుని, జార్లాబడి, బోర్లా పడి, నందీశ్వరుల్లా ఒదిగిపోయారు. నేను శివతాండవం చేసేసాను.

అసలు కృష్ణుడంటే ఎవరు? యుద్ధం ఓపెనింగ్ సీన్ లో అర్జునుడి మనోభావాలు ఎలావున్నాయి? కౌరవులు వందమంది పేర్లు ఏవిటి? (ఇవి మనకీ తెలీదు. ఏదో ప్రతీ వాడి పేరు ముందూ "దు" తగిలించేసి లాగించేసా. (ఎగ్జాంపుల్: దుర్యోధన, దుశ్శాసన, దుర్నీతి, దుర్గుణ, దుర్బుద్ధి, దురాక్రమణ, దుష్టపీనుగ, దూర్ గగన్ కి చావ్ మే, దులారీ, దునియా కీ మెహెఫిల్..ఇలా ). అలా వందమంది పేర్లు చెప్పేసరికి వాళ్ళలో సగం మందికి నిద్రపట్టేసింది. మిగిలిన సగం మంది (అంటే ముగ్గురి) ఫోనుల్లో చార్జి అయిపోయింది. ఫేస్ బుక్ ఆగిపోయింది. నా శివతాండవం లో స్టెప్స్ కాస్త మిస్సవుతున్నాయి. నేను నా రెండో కన్నుతో చూసాను. ఫేస్ బుక్ ఆగిన విషయం తెలుసుకున్నాను.

వెంటనే తాండవ ప్రసంగం ఆపి " ఇవాల్టికి చాలు. మళ్ళీ రేపు కలుద్దాం. రేపు పాండవుల పేర్లు, జాతకాలు చూద్దాం." అన్నాను గంభీరంగా.

అందరూ లేచి దణ్ణాలెట్టి "స్వామీ అద్భుతం, రేపు మెజార్టీ ఖాయం" అనేసి వెళిపోయారు.

మర్నాటికి హాలు సగం నిండింది. ఆరోజు పులిహోర కూడా వచ్చి చేరింది సమయానికి. నేను ఆరోజు పాండవులు ఏనక్షత్రాలలో పుట్టారు, ఏ దేస్ లో పుట్టారు, అప్పుడు డాలర్ కన్వర్షన్ రేటెంత లాంటి ముఖ్య విషయాలపై ప్రవచనం చేసాను. ఎవరూ వెరిఫై చెయ్యలేరు కాబట్టి నోటికొచ్చింది చెప్పేసాను. ఎవరూ ఆడియో, వీడియో రికార్డింగ్ చెయ్యకండా జాగ్రత్త పడ్డాను. అలా నవమి నాటికి హాలు కిటకిటలాడిపోయింది భక్త జనులతో. నేను రక్తం రుచిమరిగినవాణ్ణి. ఒక్కరిని కూడా వదల్లేదు. నాకు దండేసారు. ముందు ఇద్దరు పిల్లలు త్యాగరాజ కీర్తనలు, మధ్యలో మరో ఇద్దరు పిల్లలు అన్నమాచార్య కీర్తనలు పాడారు. చివర్లో వోటాఫ్ థేంక్సులు, దక్షిణ సమర్పణలు వెరసి సూపరు హిట్టు.

నేను నాకు తోచినంత వాళ్ళదగ్గిర దండేసుకున్నాను.నాకు పదివేలు కిట్టుబాటైంది. ధర్మకర్త గారి ఖర్చులు తీసేస్తే ఆరువేలు మిగులు. ఇంక నాకు ఫార్ములా తెలిసిపోయింది. అటుపైన నేను చెప్పని టాపిక్కు లేదు. వివరించని ధర్మ సూక్ష్మం లేదు. ఓ సారి రామాయణం చెప్పాను నెలరోజులు. తెలిసిన కథే, కానీ కొత్తగా చెప్పాలి. అందుకే నోటికొచ్చిన కల్పనలను మొదలెట్టాను.

" అసలు రాముడంటే ఎవరు? పూర్వ జన్మలో రావణాసురుడి అన్నగారు. అందుకే వాళ్ళ పేర్లు "రా" తో మొదలయ్యాయి. అసలు "రా" అంటే ఏమిటో ఎవ్వరికైనా తెలుసా?" అని ఆగి అందరికళ్ళలోకీ గుచ్చి గుచ్చి చూసాను. అందరూ "మనకెందుకొచ్చిందిరా బాబూ" అని మూసుకుని కూర్చున్నారు. నేను చిరుమందహాసం చేసి "రా అంటే రమ్మని అర్థం. రాముడు విష్ణువు. జయుణ్ణి తనదగ్గరికి రమ్మంటున్నాడు. అందుకే "రా" అని పేర్లు పెట్టుకున్నాడు తనకీ, తన వాళ్ళకీ కూడా." ఈ ట్విస్టుకి హాలంతా చప్పట్లతో మారుమోగిపోయింది.

ఒక చిన్న పిల్ల లేచి "రా రమ్మని రా రా రమ్మని రామ చిలుక పిలిచెను ఈ వేళ" అని పాట పాడింది.

నేను ఆపిల్ల తాలూకు నాన్నను పిలిచి "అమ్మాయికి దిష్టి తీయించండి" అన్నాను గంభీరంగా. ఆయన వెంటనే జేబులోంచి ఓ వంద కాయితం తీసి పిల్ల చుట్టు తిప్పి, దానిమీద మూడుసార్లు ఊసి, ఆ వంద నా చుట్టూ తిప్పి నా లాల్చీ జేబులోకి తోసేసాడు. నేను ఆమోదంగా నవ్వి, ప్రసంగం కంటిన్యూ చేసా.

ఇలా డల్లాస్, చికాగో, హ్యూష్టన్ వంటి ప్రదేశాల్లోనూ, బే ఏరియా, సియాటిల్, బోస్టను, డీసీ, ఒహవేవిటి, అమెరికా ఆమూల్నించి ఈమూలదాకా గెలిచేసాం. జెండా పాతేసాం. మన స్టార్ ఝూంఝూం అని వెలిగిపోయింది. ప్రతీ కన్వెన్షన్ కీ ఇన్విటేషన్లు, ఫ్లైట్ టికెట్, పెసలు రూం, పదేసివేలు దక్షిణ. మనం ఓ రెండు నిముషాలు మైకు ముందు నించుని ఒక కొత్త పద్యం చెప్పి, అది వాళ్ళకి వినిపించే లోపు "హరి ఓం తత్ సత్, ఎవ్రీ బడీ రిపీట్ ఆఫ్టర్ మీ...హరి ఓం తత్ సత్.." అని మూడుసార్లనేసి దిగిపోడమే. దట్సాల్. లేకపోతే అక్కడ మనసోది ఎవడు వింటాడు?

కన్వెన్షన్ మధ్యలో రాత్రి పెద్ద శాల్తీలు మందుకొట్టేసిన సమయంలో వారికి స్పెషల్ దర్శనం అప్పాయింట్ మెంట్ ఇచ్చి, నేనే దూకుడు మీద వాళ్ళ ప్రెసిడెన్షియల్ స్వీట్ కి వెళ్ళాను. అక్కడ వీలుదొరికినప్పుడు అందరికన్నా పెద్ద శాల్తీని పట్టుకుని, ఆయన చెయ్యి చూసి, " మీకు ఎదురే లేదు. కానీ, చిన్న పూజ చేస్తే, అసలు టూమచ్చన్నమాట. నేనే కాదు, ఎవరిచేతన్నా చేయించచ్చు.." అని ఆయన చెయ్యి నలిపాను.

అంతే ఆయన మరో పదివేలు ఎడ్వాన్సు కొట్టి, మనకి వీలున్నప్పుడు వాళ్ళింటికి వచ్చి, అవుట్ హవుస్లో హోమాలు గట్రా చేసుకుని, అయ్యాకా చెప్పి డబ్బులు పట్టుకుపోమన్నాడు. ఇదో పిల్ల కాలవ.

ఇలా త్రీ ఫ్లేవర్స్ అండ్ సిక్స్ కాయల్స్ గా యాపారం జోరుగా సాగుతోంది. అప్పుడప్పుడూ ఇండియానించి వచ్చే నాన్ లోకల్ గాళ్ళ కాంపిటీషన్ కి తట్టుకుని, రాటు తేలి, నేను తెగ రెచ్చిపోతున్నాను. ఇంక నాకే ఈ వాగుడు చిరాకు దొబ్బింది.

అందుకని చాలా ఆలోచించి, " సులభ పద్ధతి జీవితం " మీద పుత్తకాలు రాయడం మొదలెట్టా. అది మాత్రం మనకేం తెలిసి చచ్చును? అయినా ఎదరోడికి రాకపోతే, నాకు కన్నడంతో సహా అన్నీ వచ్చినట్టే లెఖ్ఖ. అంచేత రాసేసాను.

నా మొదటి పుస్తకం " నీ నవ్వులు నాకిస్తావా? ".

తరువాత పుస్తకం " జీవితం నీది, విజయం నీది".

తరువాత రాసిన మరో సూపర్ హిట్ పుస్తకం "ఒంటరి గుంపు".

ఇలా నా జైత్రయాత్ర కొనసాగుతోంది. నేను ఇప్పుడు రాస్తున్న రోమాంచకమైన పుస్తకం "ఫాలో మీ.." . దానిలోంచి ఒక చిన్న శాంపిల్ వదులుతా కాస్కోండి..

"ఎక్కడి గవర్నమెంట్ స్కూలు? ఎక్కడి కూచిమంచారి అగ్రహారం? అసలు ఎవరీ డొక్కా? ఎలా సాధ్యమైంది ఈ అద్భుతం? ఎలా? ఎలా? ప్రతీ అద్భుతం లోను ఒక "భుతం" వుంటుంది. భుతం అంటే భూతం. భూతం అంటే నాకు భయం. భయాన్ని మించిన భూతం లేదు. ఆ భయం పోవాలి. అది పోతేనే విజయం మనదౌతుంది.

నాకు మా వీధి మొగలో ఉన్న కుక్క కరుస్తుందని భయం. అలా కొన్నేళ్ళు ఉందా భయం. ఆనక నేనే ఒకరోజు తెగించి ఆ కుక్కని కరిచేసాను. అప్పట్నించీ నన్ను చూస్తే దానికి భయం. అది కుక్క మీద నా తొలి విజయం. అప్పట్నించీ భయం వేసినప్పుడల్లా ఎదరున్నోళ్ళని కరిచేసేవాణ్ణి. నా నిక్ నేం "టామీ". యెస్. టామీ. ఆనాటి ఆ టామీ, ఈనాడు మిమ్మల్ని ఛాలెంజ్ చేస్తున్నాడు, టాప్ మీ ఇఫ్ యు కెన్, ఇఫ్ నాట్, ఫాలో మీ..యెస్...ఫాలో మీ...ఫర్ ఎవర్...అండ్ ఎవర్..."

COMMENTS